౬

# భ య ం

భయమనేది వొకటి చిన్నప్పట్నుంచీ మన కలవడ్డ ఎరువు గుణం. దాన్నిమానవునియొక్క సహజమైన సరుకుల్లో దానినిగా ఎంచడాని కెంతమాత్రమున్నూ వీల్లేదు. పోంగొట్టుకునే వాళ్ళ కది పోతూనేవుంది. కాని తెచ్చిపెట్టుకునేవాళ్ళకు కుదిరి నెత్తి మీాది దేవతలా కూర్చుంటూనేవుంది. ఆహారనిద్రల్తోపాటు జతగూర్చి భయమనేది సర్వసామాన్య నిసర్గ ప్రవృత్తిగా పంచ తంత్రకారుడు వ్రాసేడుగాని అది వాని తంత్రమంత్రమే! మన లోని ముడిపదార్థం ఎంతమాత్రమున్నూ కాదు.

మొట్టమొదటి భయదరూపం "బూచి." ప్రతిచంటి పిల్లను "బూచేవు, బూచొస్తోంది. బూచేవు!" అని జడిపిస్తారు తల్లిదండ్రులూ అన్నలూ అప్పలూ. ఆకారంకూడా ఆచిట్టి యొక్క కట్టెదుట నిలబెట్టినట్టు అక్షరాలా వర్ణించి అభినయించి చూపెడతారు. "అదిగోనేవ్! ఎంతెంతగుడ్లో దానివి! ఎంతగడ్డముందో దానికి! జడలెల్లావిరబోసుకుని చీకట్లోంచి త్రోవ చేసుకుంటూ బావురు బావురుమంటూ వస్తూవుందో!" అని ఆచిట్టి కళ్ళుమూసుకొని గుక్కుమిక్కు మనకుండా నక్కి చిక్కిపోయే దాకాగాని విడిచిపెట్టరు.

ఇలాగ్గానే నన్ను అంతా ఝడిపించారు ఐదువళ్లు వచ్చేదాకా; అయితే ఏట ఏంజరిగిందీ! నానెత్తిమీద క్రమక్రమంగా బలిసి అడివిలా అల్లుకుపోయినప్పుడు వెంట్రుకల్ని అన్నింటినీ కేశఖండనమహోత్సవ మప్పుడు తీసివేయడం సంభవించింది. దాంతో ఆబోడిబుర్ర అద్దంలో చూచుకొని "బూచాడి పనికూడా ఇలా పట్టేస్తే వానికి గడ్డం జడలూఅన్నీ వమ్మయిపోతాయిగదా" అని అనుకొన్నాను. అనుకోని వో మాటు మాయింట్లో అలమారులోవుండే పోటకత్తి పుచ్చుకొని కాళాంధకారంలో అమవసనిసిని బయల్దేరాను. "బూచాడి గడ్డం బూచాడి జడలు తెగ్గోసి పారేశాదా" మని బయల్దేరాను. కత్తి ఎప్పుడైతే చేత్తో పట్టగలిగానో అప్పుడే బూచాడు మాయమై పోయినాడు.

రెండో భయదరూపం ఉపాధ్యాయుడు. అమ్మ వీడిల్లు బంగారంగాను; ఉపాధ్యాయుడు అనే మనిషి ఉన్నాడే అతడు బూచాడుకంటే పొడుగ్గా కూడావుండి పిల్లల్ని వేధించుకుతింటూ వుంటాడు. మాట్లాడితే అయ్యవారొస్తారోయి అని హడలగొట్టేశేవారు, ఇంటిల్లిపాదీని; తిన్నగా నన్ను మెతుకులు కూడా తిననిచ్చేవారు కారు. బూచాడు చీకట్లోవుండే నన్ను భయపెట్టేవాడు గాని ఈ అయ్యవారయినట్టయినా పట్టపగలే దోపిడీ అన్నట్టు, నాఆటల్ని దోచుకుపోయీవాడు. ఎక్కడ కనబడితే అక్కడే "ఏంచేస్తూవున్నావు అబ్బాయీ!" అనేవాడు. ఆ అనడం వినీవినడంతోనే నాప్రాణాలు కడట్టిపోయీవి.

ఈభయం ఎలా వదిలించుకోవడమా అని చాలాకాలం ఆలోచిస్తూరాగా, ఎప్పటికైనా ఫలిస్తుంది తపస్సు! నాకు వడుగు చేశారు. ఆ తరువాత అయ్యవారు వచ్చి చెవులెక్కతియ్యబోతే "ఏమండో! నేను మడిగట్టుకొన్నాను. నాకు వడుగైంది. నన్ను ముట్టుకోబోకండి నన్ను ముట్టుకున్నారా అంటే మా అమ్మతోనూ మా నాన్నతోనూ చెప్పి మిమ్మల్ని చితకతన్నిస్తాను." అనేవాణ్ణి. వడుగు అనేది మగవాణ్ణి పిడుగ్గా చేస్తుంది అనుకోండి. ఉపాధ్యాయులవారు "నీకు అవితే, బ్రహ్మోపదేశం బాగానేఅయింది!" అని వెనక్కు వెళ్ళిపోయేవారు. అది పనిగా బరెగేసి, బ్రహ్మవిద్యాపరుణ్ణై అయ్యింకొద్దీ ఎటువంటి గురువొచ్చినా "నీవెంత? నీ పేబ్బెత్త మెంత!" అని ముదలకించేవాణ్ణి. ఏమనుకున్నారో!

మరి మూడో భయదరూపం పాపభయం. ఈ భయానికి రూపనివృత్తి చేయడమే బహుప్రయాస. నల్లిని కాల్తో రాయడం దోమను చేత్తో మోదడం ఇదే పాపం అని కొందరు నిర్వచిస్తూవుంటే, ఆలగోల బాలగోల అయిపోతుందనే వెఱపూ వెంచాటూ లేకుండా విరోప్లేనులనుండి కొందరు ఘోరంగా బాంబులు నేలకు విసిరేస్తూ వున్నారు! పాపరూప ప్రమాణం కామరూప ప్రమాణం ఒకటే—చింతాకంత పాపం తాము రాకంతవుతుంది. చీపురుపుల్లంత పాపంతాళవృక్షమంతవుతుంది. అంచేత ఈ పాపమనే భయం ఏపని చేదామన్నా మనిషిని సంకుచిత స్వభావునిగాచేసి పారేస్తుంది.

దీనికో చిన్న ఇతిహాసం వుంది—బలేనవ్వొస్తుంది చదివితే. చదవకుండానే నవ్వొస్తుందా మరీమంచిది—

చంద్రవంక అనే పొంకపు టొయ్యారి వొకర్తెవుంది ఈ జగత్తులో తప్పుపుట్టింది అది. చిత్రకారుడు చిత్రిస్తే రెండు గీతలు గీసి ఒక చుక్కెట్టి ఆ స్త్రీయొక్క వక్షోజాన్ని చూపించగలడేమోగాని, ఆ వక్షోజాన్ని ఆవరించివుండే చీరపయట సౌందర్య పరివేషం మనమూహించుకోవలసిందే. కవి విలిఖిస్తే నాలుగుపంక్తుల్లో ఆ స్త్రీయొక్క అధరోష్ఠం వర్ణించగలడేమోగాని ఆ పెదవిలోంచి వుట్టిపడే అమృత మాధుర్యాన్ని మనమూహించుకోవలసిందే. గాయకుడు పాడితే రెండుతీగెలమీద ఆ స్త్రీయొక్క శృంగార రసాన్ని నట్టాట్లు పణిచ్చేడేమోగాని, తొణికింపు కతీతమై విలసిల్లే ఆ ప్రేమపూరితమైన నీరవ విజ్ఞానం మనమూహించుకోవలసిందే.

ఆమెకూ బూచికీ ఏమాత్రం పోలికలేదు. ఆమె చర్యకూ అయ్యవారి చర్యకూ సహస్రవార. అయితే నాకు లోపల పికరు. ఆమెను చూచినప్పుడల్లా పికరే! ఈ పికరు వదిలిపోయ్యే గత్యంతరం ఏమిట్రాఅని నూనూగు మీసాలొచ్చినప్పట్నుంచీ ప్రయత్నం.

ఓ రేయి జాడజాడగా వెన్నెల లగపీస్తూవుంది. వాడవాడా "సోడా? గోడా?" అన్న అనుమానమే. అలాంటప్పుడు ఆవె, అవగా చంద్రవంక అన్న జవ్వని విహారిస్తూవుంది. నాకు లోపల

జంకట్టు కుంటిందనో? సమయం వొచ్చిందికదా అవి నా పూర్వ పరిచితులైన, పరిచితులని ఎందుకు అంటూవున్నా ననగా వారంటే చాలాకాలమై భయము నాకు పోయిందిగా! —ఆ బూచాడూ ఆ వుపాధ్యాయుడూ ఇద్దరూ కూడా నన్ను దుయ్యబట్టుకొని "ఏమోయి వత్సా! భయపడుతున్నావు?" అని అడిగారు. అడిగితే "భయం! నాకెందుకు భయం!" అన్నాను. అన్నానేగాని లోపలి పికరు? అదల్లాగే వుంది. అప్పుడు వుపాధ్యాయుడు ఏంచేశాడు అంటే అల్లా ఖపేరావు అన్నాడు. అని నాకు ఆ పిల్లను కటించి "సెక్సు ఫిజియాలిజీ", అంటే ఇప్పటి పరిభాషలో ఇ. యన్. టి. లు అనుకోండి, ఆ సంగతులన్నీ విప్పిచెప్పినట్లు చెప్పి చూపించాడు. ఆపాళంగా అనుకొన్నాను. "సితస్సాదియ్యా! ఉపాధ్యాయుడా! నీకడుపులో ఎంత వూకవుందీ!" అనుకొన్నాను. వాని సౌందర్య విజ్ఞానానికి ముగ్ధుణ్ణైపోయాను. అలా ముగ్ధుణ్ణై యుపాధ్యాయుణ్ణి బ్రహ్మరథం పట్టేస్తూవుంటే బూచాడేంచాశాడూ? "ఉపాధ్యాయుడు చెప్పింది అసలు నేర్చుకోవలసినదానిలో అవగింజంతన్నా కాలేదు." అని తాను "సెక్సు సైకాలిజీ", అంటే ఇప్పటిపరిభాషలో, కిసెస్సు, వాటిగివింగ్సు, వాటి మిస్సింగ్సూ, వాటి మిస్గివింగ్సూ అను కోండి. ఆ సంగతులన్నీ క్షుణ్ణంగామథించి వ్యాకుచ్చినట్లు వ్యాకుచ్చి కణ్ణపేయం గావించాడు. ఆపాళంగా అనుకొన్నాను "నీయింట బట్టారంగాను బూచోడా

నీవెంత వాడవోయి !" అని అనుకొన్నాను. వాని ప్రణయ విజ్ఞానానికి నోరు తెఱచి నిర్విణ్ణుణ్ణైపోయినాను.

ఇప్పుడు నీ కడుపులోని భయం ఏలావుంది ? అన్నారు ఇద్దరు స్నేహితులూకూడా వొక్క గొంతుకనన్నట్టు అంటే పాపభయం పోయిందన్నాను. "మరేం భయముమట్టుకుంది ?" అని అడిగేరు. "పెళ్ళిభయం" అన్నాను.

అనేసరికి "ఆ భయం మేంతీర్చలేం అర్చలేం. అది మీలో మీరు చూచుకోవలసిందే" అని బూచాడూ ఉపాధ్యాయుడూకూడా ఇద్దరూ తిరోహితులైనారు. అక్కడున్నదల్లా నేనూ ఆ సుందరీ ! సుందరి మెల్లిగా అడిగింది. "పెళ్ళిభయం అంటే ఏమిటి ?" అని "ఏమీలేదు నీ ముఖంమీద్మది పోత్ర పొక్కలేను" అన్నాను. ఆపాళంగా పక్కననవ్వి ఆ చక్కని చుక్క "ఇవిల్లావుంటాయి అనుకొంటూ వున్నారా ! ఇవెంతో నేపా పోంగొట్టుకోవాలంటే? అలా బజారు కెళ్ళి వొక్కస్నోసీసా వొక్క ఫేస్ పౌడరుడబ్బా, తీసుకురండి. తీసుకువచ్చి నాకివ్వండి. ఇచ్చి అలాచూస్తూ వుండండి" అంది. తెచ్చియిచ్చాను. ఆరెండూ చంకనెట్టుకుని "చూడండీ ! వీటికేంగాని cream తెలియదూ మీకు ? పెండ్రికలూడ్చే మీగడ ? ఆఁ తెలిసుకేం ? బొమ్మ కూడా చూచేవుంటారు ! అదోట్యూబ్ తెచ్చి పెట్టండి."

అంది. తెచ్చియిచ్చాను. "దాంతోపాటు గ్లిసరీన్ ట్రాన్స పెరెంటు సోపుతెచ్చి పెట్టలేకపోయినారూ" అంది. అదీ తెచ్చియిచ్చాను "మజి వో వోయిల్‌చీర! ఓ కోయిల్ కలర్ బాడిస్! పోయిల్సుపోయే కెమికల్ వాష్ అవన్నీ యేవండీ!" అంది. అవీ తెచ్చియిచ్చాను. ఆలాగ్గా అడిగిందల్లా ఆ సుందరికి పట్టుకువచ్చి యిస్తూ ఆ సుందరికేసి చూస్తూ కొంతకొంత పికరు పోగొట్టుకున్నాను. కొంతకొంత అని ఎందుకు అన్నానూ అంటే పెళ్ళికాకుండానే ఇన్నికోరికలు కోరిఽమనిషి పెళ్ళికాల మందెన్ని కోరుతుందో అని—ఎన్ని హిరణ్యాక్ష వరాలడుగుతుందో అని. కొంతమట్టుకవన్నీ అంచనావేసి, ఒక అరచేతి వెడల్పు జరీవున్న సేలంచీర, బెత్తెడు వెడల్పున్న చైనుసహా రిస్టువాచీ, మణుగున్నరతూగే ఏకండీ మిఠాయివుండా యిలాంటి వన్నీ పెళ్ళిబహుమానాలంటూ పట్టుకొచ్చి పెళ్ళికిముందే చూపించి ముందుంచాను. సుందరి మిక్కిలి సంతోషించింది. అవన్నీ అంది పుచ్చుకుంది. పుచ్చుకొని అందికదా "చూడండీ! పెళ్ళికి భాజాభజంత్రీలు పెట్టబోయ్యేరు గనుక పురోహితుణ్ణి పిలవనంపేరు గనుక!" అంది. "వద్దంటే మానేశాస్తాను." అన్నాను. "వద్దన్నమాటేగా! మఱొక్కటి! పెళ్ళిఅప్పుడు మీరే వాగ్దానాలు చేసినాసరే నేనుమాత్రం ఏమీవాగ్దానం చెయ్యను సుమండీ! ఆడదానికి వాగ్దానాలుఏమిటి, కోరికలుంటే చెప్పుకోవాలిగాని" అంది. అంటే ఏమనేదినేను! పోయినపికరు మళ్ళా కొంచెం ఇంటెర్మిటెంటు ఫీవర్లా నాకు లోలోపల తగిలింది.

అయినా అది పైకి వెల్లడించకుండా "సరే నీయిష్టంవచ్చినట్లే" అన్నాను. అగ్నిహోత్రంముందు కూర్చుని "నాతిచరామి" అని నామాటనేను వప్పగించాను. మగాడిది వాగ్దానమేగా వాడికి కోరికలేమిటి గనకా! సుందరి నాచెవిలో మెల్లిగా తనకోరిక లిలా వూదింది. "చూడండీ! నేను మీకేసిచూచినప్పుడే మీరు నాకేసి చూడవలెను. నేను మిమ్మల్ని ముద్దెట్టుకున్నప్పుడే మీరునన్ను ముద్దెట్టుకోవలెను. నేను మిమ్మల్ని కౌగలించుకొన్నప్పుడే మీరు నన్ను కౌగలించుకోవలెను." అని నెలకు మూడువానల్లా మూడుకోరికలు కోరుకుంది.

కోరి అటుతిరిగి కూర్చుంది. నేను ఇటుతిరిగి కూర్చున్నాను. అగ్నిహోత్రుడు సాక్షిగా మళ్ళీ ఆసుందరి నాకేసిచూడలేదు. నేను ఆసుందరికేసి చూడలేదు. పోనీ కళ్లుమూసుకు ముద్దెట్టుకుంటుందేమోఅని అనుకున్నాను. ఉఁహూ! పోనీ చూడకుండా ముద్దీకుండా ఊరికే కావలించుకుంటుందేమోఅని రెండుఘళ్లు ఆలానే కనిపెట్టుకూర్చున్నాను ఉఁహూ! పోనీ నేనై ఆపనులన్నీ ముందుచేదామాఅని తలపోస్తే నాకు "నాతిచర" అయిరి.

మొదటితరం రెండోతరం మూడోతరం ముత్తైదువులెంతో మందివచ్చి "ఇవేంకోరికలే, మగాణ్ణి అణిచేసే కోరికలు! అసలే పెళ్లిభయం అన్నవాడికి మరీ పిరికిమందు పోశేశావు, ఏవో కూడరానికోరికలు కోరి; ఇలాంటి కోరికలుంటాయటే! మగాణ్ణి

వాడియుత్సాహాన్ని పురస్కరించుకొని ఆడది ఎత్తెయ్యాలిగాని" అని ఎంతబోధించినా నాచంద్రవంక ఊఁహూ! పైపెచ్చు "నేనేం కోరుకొన్నానో మీకు తెలుసునా?" అని ముదలకించింది వాళ్ళందర్నీని. వాళ్ళు నాదిక్కు మొగమై "నీకేం చేటొచ్చింది? అది ఇటుతిరక్కపోతే నీవటు తిరక్కూడదా?" అన్నారు. అంటే నాకు "నాతిచరామి! నాతిచరామి! నాతిచరామి!" అన్నాను మిక్కిలి నిర్భయంగా! నవ్వలేక చచ్చారువాళ్ళంతా! చంద్ర వంకకూడా కొంచెము ముసిముసినవ్వు నవ్వింది. చాలనుకు న్నాను. మఱి ఎలాంటిభయం లేదనుకున్నాను.



| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 21-2-1987 | రాజమండ్రి | "వినోదిని"లో |